రెండు రోజులు తగ్గనున్న పగటి ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దక్షిణ తెలంగాణ నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి ఆవరించి ఉంది. దీంతో మరాఠ్వాడా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కర్ణాటక అంతర్భాగం మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఇది విస్తరించి ఉంది. ఈ కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి చెదురుమదురు వర్షాలు, అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న 48 గంటల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమైంది. జంటనగరాల్లో సాయంత్రం వేళలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, కామారెడ్డిల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. పలుచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు.

హైదరాబాద్‌లో డేంజర్ బెల్స్

దక్షిణాదిలో అత్యంత కాలుష్య మెట్రో నగరంగా గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలో పెరుగుతున్న వాతావరణ కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్నది. దక్షిణ భారతదేశంలో అత్యంత కాలుష్య మెట్రో నగరంగా మారిందని గ్రీన్ పీస్ ఇండియా తాజా అధ్యయనంలో వెల్లడైంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చి వంటి దక్షిణ భారత మెట్రో నగరాల్లో వాయు కాలుష్యం స్థాయిని తెలుసుకోవడానికి గ్రీన్‌పీస్ ఆఫ్ ఇండియా సంస్థ సర్వే నిర్వహించింది. ఇతర నగరాల కంటే భాగ్యనగరంలో వాయుకాలుష్యం ఎక్కువగా ఉన్నట్టు తేలింది. హైదరాబాద్‌లో 2.5 పీఎం కాలుష్య కారకాలు ఉన్నట్టు వెల్లడైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన ప్రమాణాల కంటే మన నగరంలో కాలుష్యం 14 రెట్లు అధికంగా విడుదలవుతున్నది. ప్రపంచ వాయు నాణ్యత సూచీలో కాలుష్య నగరాల జాబితాలో భాగ్యనగరం చేరడం అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నది. బంజారాహిల్స్‌లో 127, కేపీహెచ్‌బీలో 124, జూపార్క్‌లో 144, సైదాబాద్‌లో 100 ఏసీఐలకు వాయుకాలుష్యం చేరుకున్నది. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న మల్లాపూర్, నాచారం, బాలానగర్, పటాన్‌చెరు, పాశమైలారం ప్రాంతాల్లోనూ ఇటీవల వాయుకాలుష్యం అనూహ్యంగా పెరిగింది. దేశంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో న్యూఢిల్లీ అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత కోల్‌కతా, హైదరాబాద్ ఉన్నాయి. ముంబై కంటే భాగ్యనగరంలో వాయుకాలుష్యం ఎక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్ నగరంలో ప్రతిరోజు 7 వేల మెట్రిక్ టన్నుల చెత్త విడుదలవుతుండటంతో అధికంగా కాలుష్యం పెరుగుతున్నదని గ్రీన్ పీస్ ఇండియా సంస్థ తన సర్వేలో గుర్తించింది.

అమృత్ స్టేషన్ల ఎంపికలోనూ వివక్షే

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై అడుగడుగునా వివక్ష చూపుతున్న కేంద్ర ప్రభుత్వం.. అమృత్ స్టేషన్ల ఎంపిక విషయంలోనూ అదే ధోరణి ప్రదర్శించింది. 26న ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా 554 అమృత్ స్టేషన్ల నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటిలో ఏపీ నుంచి 34, తెలంగాణ నుంచి 15 స్టేషన్లే ఎంపిక చేశారు. రాష్ట్రంలో 15 అమృత్ స్టేషన్ల ఏర్పాటుకు రూ.230.24 కోట్లు కేటాయించిన కేంద్రం.. ఏపీలో 34 అమృత్ స్టేషన్లకు రూ.613.30 కోట్లు కేటాయించింది.

రాష్ట్రంలోని అమృత్ స్టేషన్ల వివరాలు

స్టేషన్	కేటాయింపు (రూ.కోట్లలో)
బాసర	11.33
బేగంపేట	22.57
గద్వాల	9.49
జడ్చర్ల	10.94
మంచిర్యాల	26.49
మెదక్	15.31
మేడ్చల్	8.37
మిర్యాలగూడ	9.5
నల్లగొండ	9.5
పెద్దపల్లి	26.49
షాద్‌నగర్	9.59
ఉమ్దానగర్	12.37
వికారాబాద్	24.35
వరంగల్	25.41
యాకుత్‌పుర	8.53
మొత్తం	230.24

మేడిగడ్డపై అధ్యయన కమిటీ ఏదీ ?

- డైనోసార్ విచారణ నివేదిక ఏమైంది?
- విజిలెన్స్ కోర్ డ్రిల్లింగ్ టెస్టు ఫలితం బహిర్గతం చేయరేమి?
- ఎన్‌డీఎస్‌ఏ పరిశీలన ఇంకెన్నాళ్లు?
- మానసిక ఒత్తిడిలో ఇంజినీర్లు
- వానకాలంలోగా పనులు జరిగేనా? తదుపరి డ్యామేజీకి బాధ్యులెవరు?

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు గురై నాలుగు నెలలు గడుస్తున్నా కేవలం విచారణలు, సమావేశాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల పేరుతో ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వానకాలం వచ్చే వరకు పొడిగిస్తూ బరాజ్‌ను నీటిపాలు చేస్తారనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికే తెలంగాణలో తాగు, సాగు నీటి సమస్యలు తలెత్తి వ్యవసాయ భూములన్నీ నోర్లు తెరుస్తున్నాయి. ప్రాజెక్టులపై ఇంకా నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయినా, ప్రభుత్వం ఏమి చేయబోతున్నదో ఎవరికీ అంతు చిక్కడం లేదు. మేడిగడ్డ బరాజ్‌లో ఏడో బ్లాకులో 20వ పిల్లర్ గత ఏడాది అక్టోబర్ 21న కుంగిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటుపై అధ్యయన కమిటీ వేస్తామని ప్రకటించినా ఇంతవరకు ఆ ఊసెత్తడం లేదు. ఇదిలా ఉండగా మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లో ఏర్పడిన లోపాలను ఇన్వెస్టిగేషన్ చేసేందుకు నిర్మాణ సంస్థ డైనోసార్, పార్సన్ అనే ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించింది. డైనోసార్ సంస్థ గత రెండు నెలలుగా ఇన్వెస్టిగేషన్ పనులు కొనసాగిస్తున్నది. కానీ, విచారణ వివరాలను వెల్లడించడంలేదు. అధికారులు సైతం ఏడోబ్లాకు వద్ద పైనుంచి నీరు వస్తే దారి మళ్లించే ప్రయత్నాలు సైతం చేసుకోలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అన్నారం బరాజ్‌లోని నీటిని వదలగా ఏడోబ్లాకుకు నీరు చేరుకున్నాయి. ప్రస్తుతం విచారణ పనులు మళ్లీ పెండింగ్‌లో పడ్డాయి. కాగా, మేడిగడ్డ బరాజ్‌పై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించగా, విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్ విచారణ చేపట్టారు. మేడిగడ్డ బరాజ్‌లోని పిల్లర్లకు విజిలెన్స్ బృందం కోర్‌డ్రిల్లింగ్ టెస్టు చేయించింది. ఈ టెస్టులో పిల్లర్లు పూర్తిగా నాణ్యతతోనే ఉన్నట్టు విజిలెన్స్ బృందం గుర్తించినట్టు సమాచారం.ఈ విషయాన్ని విజిలెన్స్ బృందం గోప్యంగా ఉంచింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడిగడ్డ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేల బృందం సమావేశం నిర్వహించగా ఇన్‌చార్జి ఈఎన్సీ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో విజిలెన్స్ బృందం కోర్‌డ్రిల్లింగ్ టెస్టు చేయించిన విషయం, దాని ఫలితం గురించి వెల్లడించలేదు.

ఎన్‌డీఎస్‌ఏ పరిశీలనకు ఇంకెన్నాళ్లో?

మేడిగడ్డ, అన్నారం బరాజ్ లోపాలపై ఆదిలోనే సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్‌ఏ బృందం ప్రాథమిక విచారణ చేపట్టాయి. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు మేడిగడ్డ వద్ద మకాం వేసి సమీక్ష నిర్వహించారు. అప్పటి ఈఎన్సీ మురళీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా బరాజ్‌లపై విచారణకు కమిటీ వేస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించి వెళ్లిపోయారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సైతం మళ్లీ ఇక్కడే సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, ఎన్‌డీఎస్‌ఏతో విచారణ జరిపిస్తామని చెప్పారు. అప్పటి నుంచి విచారణ లేదు.. కమిటీ ఏర్పాటు లేదు. ఇటీవల రాష్ట్ర డ్యాం సేఫ్టీ నిపుణుల బృందం వచ్చి అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లను పరిశీలించి వెళ్లింది. నివేదికను ఎన్‌డీఎస్‌ఏకు అందజేస్తామని, వారు వచ్చి పరిశీలన చేస్తారని తెలిపింది. అయినా, ఎలాంటి పురోగతి లేదు. వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం వానకాలం వరకు ఇలాగే కాలయాపన చేస్తూ చేతులెత్తేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టును నీటిపాలు చేసేందుకే కాలయాపన చేస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతున్నది. బరాజ్‌లో ఏర్పడిన లోపాలను త్వరగా సవరిస్తే సాగునీరు అందించే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

అన్నారం బరాజ్‌లో విశాఖపట్టణం నిపుణుల పరిశీలన

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌ను ఆదివారం విశాఖపట్టణానికి చెందిన గ్రౌటింగ్ నిపుణులు పరిశీలించారు. బరాజ్‌లో ఏర్పడిన సీపేజ్‌లకు ఆప్కాన్స్ సంస్థ కెమికల్ గ్రౌటింగ్ చేసిన విషయం తెలిసిందే. అయినా మళ్లీ చిన్న చిన్న సీపేజ్‌లు కనిస్తున్నాయి. వాటితో ప్రమాదమేమీ లేదని ఇటీవల పర్యటించిన రాష్ట్ర డ్యాం సేఫ్టీ నిపుణులు తెల్పినప్పటికీ ఎన్‌డీఎస్‌ఏ పర్యటనకు ముందే ఇతర నిపుణులతో ఇన్వెస్టిగేషన్ చేయించాలని ఈఎన్సీ అనిల్‌కుమార్ ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు విశాఖపట్టణం నుంచి ఆరుగురు గ్రౌటింగ్ నిపుణులు అన్నారం బరాజ్‌ను సందర్శించారు. గ్రౌటింగ్ చేసిన విధానంపై పరిశీలన జరిపారు. డ్రిల్లింగ్, గ్రౌటింగ్ మిషనరీతో శాంపిల్స్ సేకరించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి సాండ్ గ్రౌటింగ్, కెమికల్ గ్రౌటింగ్, మైక్రో కాంక్రీట్ గ్రౌటింగ్‌లో ఏ పద్ధతిలో చేస్తే బాగుంటుందనే విషయమై పరిశీలన జరిపి సూచనలు చేయనున్నారు. ఇదిలా ఉండగా అన్నారం బరాజ్‌లో ఇన్వెస్టిగేషన్‌కు అవకాశం ఇచ్చిన పార్సన్ సంస్థను విచారణ నుంచి ప్రభుత్వం తప్పిస్తున్నట్టు సమాచారం.

బడి సంచి బరువు 30% తగ్గింపు

- 90 నుంచి 70 జీఎస్‌ఎంకు పేపర్ మందం
- వచ్చే విద్యాసంవత్సరానికి 1.90 కోట్ల ఉచిత పుస్తకాలు
- ఏప్రిల్ చివరికల్లా జిల్లాలకు చేర్చేలా ప్రణాళికలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థుల పాఠ్య పుస్తకాల బరువు గణనీయంగా తగ్గనున్నది. ఒక్కో తరగతి పుస్తకాల బరువు 25 నుంచి 30 శాతం మేర తగ్గనున్నది. పాఠ్యపుస్తకాల ముద్రణను వినియోగించే పేపర్ మందం తగ్గడమే ఇందుకు కారణం. ఇదివరకు 90 జీఎస్ఎం (గ్రామ్స్ పర్ స్కేర్ మీటర్) మందం పేపర్‌ను వినియోగించగా, వచ్చే విద్యాసంవత్సరం నుంచి 70 జీఎస్‌ఎం మందం పేపర్‌ను ఉపయోగించుకొనేందుకు ఇటీవలే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పుస్తకాలు తేలికగా, సన్నగా మారుతాయి.

పేపర్ మందం తగ్గింపు ఇలా..

- పుస్తకాల కవర్ పేజీ మందం ప్రస్తుతం 250 జీఎస్‌ఎం ఉండగా, తాజాగా 200 జీఎస్‌ఎం కు తగ్గించారు.
- ప్రతి నెలలో చివరి శనివారం బ్యాగ్‌లెస్‌డేగా నిర్వహిస్తున్నారు. ఈ రోజు విద్యార్థులు బ్యాగ్ లేకుండాగానే బడికొస్తారు. వారికి కొన్ని కృత్యాల ద్వారా పాఠాలను నేర్పిస్తున్నారు.

1.90 కోట్ల ఉచిత పుస్తకాలు

2024 -25 విద్యాసంవత్సరంలో 1.90 కోట్ల ఉచిత పుస్తకాలను ముద్రించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. ఇందుకు రూ.150 కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని తేల్చారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పదో తరగతిలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టనున్నారు. దీంతో 1 నుంచి 10 తరగతుల్లోని విద్యార్థులందరికీ ద్విభాషా పుస్తకాలు (తెలుగు, ఇంగ్లిష్) అందజేస్తారు. పుస్తకం సైజు పెరగడంతో పుస్తకాలను పార్ట్ -1, పార్ట్ -2గా విభజించారు. ఏప్రిల్ 30లోపు పార్ట్ -1 ముద్రిత పుస్తకాలను జిల్లా పాయింట్లకు చేర్చాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొన్నారు. ఇక జూలైలో పార్ట్ -2 పుస్తకాలను అందిస్తారు. స్మార్ట్‌ఫోన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్‌చేసి అన్ని తరగతుల్లో పుస్తకాల పాఠాలను విద్యార్థులు చదువుకోవచ్చు.

తరగతి	ఇదివరకున్న బరువు	తగ్గిన తర్వాత
1వ	1.991 కేజీలు	1.408 కేజీలు
6వ	2.253 కేజీలు	1.759కేజీలు
10వ	5.373 కేజీలు	4.190కేజీలు

11వేల నుంచి 7వేల టన్నులకు..

పేపర్ మందం తగ్గించడంతో విద్యాశాఖ కొనుగోలు చేయాల్సిన పేపర్ 3 వేల టన్నులకు పైగా తగ్గింది. ఇది వరకు వినియోగించిన 90 జీఎస్‌ఎం పేపర్‌తో ఏటా 11,700టన్నుల పేపర్‌ను సేకరించాల్సి ఉండగా, 70 జీఎస్‌ఎంకు తగ్గించడంతో 8 వేల టన్నులకు చేరింది. బడ్జెట్ కూడా రూ.30 నుంచి 40 కోట్లకు తగ్గింది.

• అమ్మవారిపేట సరస్సులో అరుదైన పక్షి

వరంగల్ పట్టణానికి సమీపంలోని అమ్మవారిపేట సరస్సు వద్ద దేశంలో మొదటిసారిగా కనిపించిన అరుదైన స్పర్-వింగ్డ్ లాప్వింగ్ అనే పక్షులు కనువిందు చేస్తున్నాయి. వీటిని చూసేందుకు దేశవ్యాప్తంగా ఉన్న పక్షి ప్రేమికులు తరలివస్తున్నారు.

తనయుడిని చంపిన తండ్రి

మేడ్చల్, ఫిబ్రవరి 25: యువకుడి అదృశ్యం కేసు మలుపు తిరిగింది. 14 రోజుల అనంతరం మృతి చెందినట్టు ఆచూకీ లభించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. శామీర్‌పేటలోని లాల్‌గడీమలక్‌పేటకు చెందిన కొరివి మంజుల-రాంచందర్‌ల పెద్ద కొడుకు కొరివి నరేశ్ (27) ఈ నెల 11న అదృశ్యమైనట్టు తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనుమానంతో తండ్రిని ప్రశ్నించగా, తానే హత్య చేసినట్టు ఒప్పుకొన్నాడు. ఈ నెల 11న ఉదయం నరేశ్ తన తండ్రి రాంచందర్‌తో ఆస్తిలో వాటా కోసం గొడవ పడ్డాడు. దీంతో నరేశ్‌కు తండ్రి లాల్‌గడీమలక్‌పేట శివారులోని మర్ల బావి వద్ద మద్యం తాగించి అతని మెడపై కాలుపెట్టి హత్య చేశాడు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బావిలోకి విసిరేశాడు. దీంతో పోలీసులు యువకుడి అదృశ్యం కేసును 302, 201 సెక్షన్ల కిందికి మార్చారు.

బదిలీ.. బదిలీ!

➤ మొదటిపేజీ తరువాయి...

భారీ ఎత్తున జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల బదిలీలకు నడుం బిగించింది. అన్ని శాఖల్లో బదిలీలు, డిప్యుటేషన్లు ఇబ్బడి ముబ్బడిగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, స్థానిక కాంగ్రెస్ నేతలు బదిలీలపై దృష్టిసారించి గతంలో తమకు సహకరించని వారిని పక్కన పెట్టించడం, అనుకూలంగా ఉన్నవారిని నచ్చినచోటికి బదిలీ చేయించుకోవడంపై దృష్టిపెట్టారు. ఈ గందరగోళంలో సందులో సడేమియా అన్నట్టు కొందరు ఉన్నతాధికారులు లంచాలకు తెరలేపి అందినకాడికి దండుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బదిలీలకే బదిలీలు

రాష్ట్రంలో గడిచిన 70 రోజులుగా జరుగుతున్న బదిలీల తంతు గమ్మత్తుగా ఉన్నది. కొన్ని పోస్టింగ్‌లు మళ్లీమళ్లీ వేశారు. ఒకరికే మూడేసి బదిలీ ఉత్తర్వులు వచ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక్కసారి బదిలీ చేశారంటే అర్థం ఉన్నది. మరి రెండుమూడుసార్లు ఒకే వ్యక్తి ఆర్డర్ కాపీ మారిందంటే.. ఆ లోగుట్టు పెరుమాళ్లకెరుక. గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి అధికారులకే కాదు.. కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా గత 70 రోజుల్లో రెండేసి బదిలీ ఉత్తర్వులు అందుకున్న సందర్భాలున్నాయి. ఒక ఉత్తర్వు ఇచ్చి.. దాన్ని హోల్డ్‌లో పెట్టి.. మళ్లీ ఇంకో ఉత్తర్వు ఇచ్చిన తీరు అధికార వర్గాల్లో చర్చనీయాంశమయ్యింది. రెవెన్యూ శాఖలో ఈ నెల 10న భారీగా ఆర్డీవోల బదిలీ జరిగింది. ఆ తర్వాత ఐదు రోజులకే అందులో మార్పులు చేర్పులు చేశారు. కొందరి పోస్టింగ్‌లను మార్చారు.

రెవెన్యూ శాఖలో ఐదు రోజుల్లోనే మార్పులు

రెవెన్యూ శాఖలో విచ్చలవిడిగా ఆర్డీవోలు, తహసీల్దార్ల బదిలీలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థ మొత్తం ఇప్పుడు కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉన్నది. వాళ్లే బదిలీలు, పోస్టింగ్ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీంట్లో ఒకరిద్దరు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారు. ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బక్క జడ్సన్ స్వయంగా తీవ్ర ఆరోపణలు చేశారు. భద్రాచలం దేవస్థానంలో ఈవోగా ఉన్న ఎల్ రమాదేవిని కీసర ఆర్డీవోగా నియమించి, రెండు రోజుల్లోనే తిప్పి పంపేశారని, హైదరాబాద్ అర్బన్ సీలింగ్ విభాగంలో ఉన్న వెంకట ఉపేందర్‌రెడ్డిని రాజేంద్రనగర్‌కు పంపి మళ్లీ ట్రాన్స్‌ఫర్‌ను రద్దు చేశారని ఉదహరించారు. వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదిలక్ష్మిని మొదట వరంగల్ అదనపు కలెక్టర్‌గా నియమించి, ఆ తర్వాత జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారని పేర్కొన్నారు. తమకు కావాల్సిన వారికి నచ్చిన చోట పోస్టింగ్‌లు ఇవ్వడం కోసం అధికారులను వెంటవెంటనే బదిలీ చేశారని ఆరోపించారు. సీఈవోల బదిలీల్లోనూ ఇదే వ్యవహారం నడిచిందని విమర్శించారు. కొందరికి అర్హతకు మించి పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు.

వైద్యశాఖలో ఆగమాగం

వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లను రద్దు చేస్తూ ఈ నెల మొదటివారంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు రోజుల్లో అందరూ సొంత ప్రాంతాలకు వెళ్లి రిపోర్ట్ చేయాలని హెచ్‌వోడీలు ఆదేశించారు. ఒక్క రోజు కూడా గడువకుండానే మాట మార్చేశారు. అవసరం ఉన్నచోట జిల్లా పరిధిలో డిప్యుటేషన్లు ఇచ్చుకోవచ్చంటూ కలెక్టర్లకు సూచనలు జారీచేశారు. ఈ ఆర్డర్ అనేక జిల్లాల్లో డీఎంహెచ్‌వోలకు, సూపరింటెండెంట్లకు వరంగా మారింది. కావాల్సిన వారికి, డబ్బులు ముట్టజెప్పినవారికి ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్ ఇస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రాష్ట్రస్థాయి డిప్యుటేషన్లలో దందా నడుస్తున్నదని వైద్యవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇటీవలే వైరల్ అయిన ఓ ఆడియోలో ఏకంగా ఉన్నతాధికారికి లంచం ఇచ్చినట్టు ఉద్యోగిని స్పష్టంగా చెప్పింది. ఓ జిల్లా డీఎంహెచ్‌వోపైనా తీవ్ర ఆరోపణలు చేసింది. డబ్బులు ఇస్తేనే పని అవుతున్నదని, కేవలం రిలీవింగ్ లెటర్‌కే రూ.30 వేలు వసూలు చేస్తున్నారని అందులో ఉన్నది. ఈ విషయం సీఎం వరకు వెళ్లినట్టు సమాచారం. దీంతో ఉన్నతాధికారులు నిజానిజాలు తేల్చకుండానే ఆ ఉద్యోగినిని సస్పెండ్ చేశారు. ఇక వైద్యశాఖలోని మరో విభాగంలో గతంలోనే వైద్యుల పోస్టింగ్‌కు సంబంధించి కౌన్సెలింగ్ పూర్తికాగా, కోర్టు కేసు కారణంగా నియామకపత్రాల జారీ ఆగిపోయింది. గత నెల నియామక పత్రాలు అందజేయగా.. అందులో 16 మంది డాక్టర్లకు కౌన్సెలింగ్ సమయంలో ఇచ్చిన ఆప్షన్ కాకుండా కొత్త స్థానంలో పోస్టిం గ్ వచ్చింది. దీని వెనుక రూ.లక్షల్లో చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్‌లోని ప్రధాన దవాఖానలతోపాటు మారుమూల ప్రాంతాల్లోనూ వైద్యులు, నర్సుల కొరత వేధిస్తున్నది. కోఠిలోని డీపీహెచ్, టీవీవీపీ, డీఎంఈ ఆఫీసుల్లో డిప్యుటేషన్‌పై వచ్చినవారు వెనక్కి వెళ్లడంతో పనులు పెండింగ్‌లో పడిపోయాయి. ఆ స్థానాల్లో తమకు నచ్చినవారిని, తమకు 'ఇచ్చిన'వారిని నియమించుకునేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీసు శాఖలోనూ అంతే

పోలీస్ శాఖలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తున్నది. డీఎస్పీల బదిలీల్లో మళ్లీమళ్లీ పోస్టింగ్ ఆర్డర్లు మార్చేశారు. జిల్లాల స్థాయిలో ఒక్కటి రెండు కాదు.. పదుల సంఖ్యలో స్టేషన్ హౌజ్ ఆఫీసర్లను బదిలీ చేశారు. సమర్థుల పేరుతో కొంతమందిని, సుదీర్ఘకాలంగా లూప్‌లైన్‌లో ఉన్నవారికి అవకాశం పేరుతో మరికొంత మందిని బదిలీ చేశారు. వీటి వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాశాఖలో డిప్యుటేషన్లే

రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ఉపాధ్యాయుల బదిలీలంటేనే భయపడిపోయేవి. అందువల్ల ఉపాధ్యాయులకు బదిలీలు, డిప్యుటేషన్లు ఇచ్చేందుకు వెనుకాముందు ఆలోచించేవాళ్లు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చాక విద్యాశాఖలో ఆన్‌డ్యూటీలు, డిప్యుటేషన్లు భారీగానే ఇచ్చారు. కాంగ్రెస్ నేత చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న భార్యనే ఒక ఉదాహరణ. ఒక్క నెలలోనే 50 మందికిపైగా ఉపాధ్యాయులకు డిప్యుటేషన్లు ఇచ్చినట్టు ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. దీంట్లో ఒకరిద్దరు కీలక అధికారులు తలదూర్చారు. వాళ్లు సీఎం ఆదేశాలున్నాయని చెప్పి వర్క్ ఆర్డర్లు ఇచ్చేశారు. జీతం పాత స్కూల్లోనే డ్రా చేసేలా.. ఉద్యోగం మాత్రం తాము కోరుకున్న స్కూల్లో/ ఆఫీసులో చేసేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈ విషయం తొలుత పత్రికల్లో రావడం, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు కూడా వ్యతిరేకించడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ, అప్పటికే 50 మందికిపైగా ఉత్తర్వులు ఇచ్చేశారు. అక్రమంగా ఇచ్చిన ప్రతీ ఉత్తర్వును రద్దు చేయాలన్న డిమాండ్ వస్తున్నది.

కాళ్లు మొక్కినా కనికరించలే..

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ)/ములుగు: మేడారం మహా జాతరలో విధులు నిర్వర్తించిన పోలీస్‌శాఖలోని కొందరు ఉన్నతాధికారుల వైఖరి విస్మయం కలిగించేలా, ఆ శాఖకే మచ్చ తెచ్చేలా మారింది. విధుల్లో ఉన్న ఆ శాఖ అధికారులపైనే దాడి ఘటనలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. వీటన్నింటికి కారణమైన పోలీస్ ఉన్నతాధికారులపై శాఖపరమైన చర్యలు ఉంటాయా? లేదా? అనే విషయం చర్చనీయంగా మారింది. ఆయా ఘటనలపై కొందరు తీసిన వీడియోలు శనివారం ఉదయం సోషల్ మీడియాలో ప్రత్యక్ష్యం కావడంతో పోలీసు అధికారుల దౌర్జన్యాలు వెలుగులోకి వచ్చాయి. మేడారంలో ఈ నెల 23న వరంగల్ పోలీస్ కమిషనర్ స్పెషల్ విభాగంలో పనిచేస్తున్న ఏఆర్ ఎస్సైని అతడి భార్య ముందే ఐపీఎస్ అధికారి కొట్టగా పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ నెల 24న ఐపీఎస్ అధికారి ఏఆర్ ఎస్సైని కొట్టలేదని, ఇది అవాస్తవని ములుగు జిల్లా ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. ఇంతలోనే ఏఆర్ ఎస్సై భార్య తన కండ్ల ముందే తన భర్తను ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం కొట్టాడని పేర్కొంటూ సోషల్ మీడియాలో వీడియోను విడుదల చేశారు. వరంగల్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం కూడా ఏఆర్ ఎస్సైపై దాడిని ఖండిస్తున్నట్టు ఆడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ రెండు అంశాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

చర్యలకు అటవీశాఖ సిబ్బంది డిమాండ్

అటవీశాఖలో శ్రీనివాస్ అనే ఫారెస్టు బీట్ ఆఫీసర్‌ను సైతం 23న అదే ఎస్పీ గౌస్ ఆలం హెలిప్యాడ్ చెక్‌పోస్టు వద్ద అతడి భార్య ముందే కొట్టాడని పేర్కొంటూ జిల్లా అటవీ శాఖ అధికారికి తెలంగాణ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. చట్టపరమైన చర్యలు తీసుకోనట్లయితే విధులను బహిష్కరిస్తామని ఫారెస్టు అధికారులు డీఎఫ్‌వోకు తేల్చి చెప్పారు. ఇతర పోలీస్ అధికారులు కూడా పలు చెక్‌పోస్టుల వద్ద మీడియా ప్రతినిధులు, వీఐపీలు, భక్తులపై విరుచుపడిన ఘటనల వీడియోలు సోషల్ మీడియాలో బయటకొస్తున్నాయి. పోలీస్ అధికారుల తీరు ఆ శాఖకు మచ్చ తెచ్చింది. వారి బంధువులు, కుటుంబ సభ్యుల దర్శనాల కోసం అడ్డుగా ఉన్న సాధారణ భక్తులను లాగి పడేసిన ఘటనలు మేడారం గద్దెల వద్ద చోటుచేసుకున్నాయి.

జాతర నిర్వహణలో సర్కారు ఫెయిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మేడారం మహాజాతర నిర్వహణలో సర్కారు వైఫల్యం స్పష్టమైంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. అడుగడుగునా భక్తులు తీవ్ర అసహనానికి గురైన పరిణామాలే ప్రభుత్వ వైఫల్యాన్ని తేల్చి చెప్తున్నాయి. ఈనెల 21 నుంచి 24 వరకు ములుగు జిల్లా మేడారంలో జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ విషయంలో సర్కారు మొదటి నుంచి శీతకన్ను వేసింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నిరుటి వరకు నిర్వహించిన ఏ జాతరలోనూ (2004లో మినహాయించి) జరగనంత అసౌకర్యం ఈసారి జరిగిందని భక్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జాతర నిర్వహణలో శాఖలు వేటికవే నిర్లక్ష్యాన్ని, నిష్క్రియాపరత్వాన్ని ప్రదర్శించాయి తప్ప బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవాదాయశాఖ గద్దెల ప్రాంగణంలో హుండీలు పెట్టేందుకు చూపిన శ్రద్ధలో కనీసం పదోవంతు భక్తులకు బంగారం (బెల్లం) ప్రసాదం అందజేసే విషయంలో చూపలేదని ఆగ్రహం వెల్లువెత్తింది.

చేతులెత్తేసిన పోలీసులు

జాతర నిర్వహణలో పోలీసుశాఖ ఒంటెద్దు పోకడలు, ఆధిపత్య ధోరణితో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సకల శాఖల అధికారులను హూంకరిస్తూ తమవారినే దర్శనానికి అనుమతిస్తూ సాధారణ భక్తులను, పోలీసుశాఖే జారీ చేసిన వీఐపీ, వీవీఐపీ పాస్‌లు ఉన్న భక్తులనూ దర్శనానికి అనుమతించలేదనే అపవాదును ఆశాఖ మూటగట్టుకున్నది. సీఎం, గవర్నర్, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనాలు మినహా ఇతరును పూచికపుల్లలా తీసిపారేశారని విమర్శలను ఎదుర్కొన్నారు. ఓ ఐపీఎస్ అధికారి ఒక సీఐపై చేయి చేసుకోవడంతో ఉన్నతాధికారుల తీరుపై విస్మయం వ్యక్తమవుతున్నది.

గంటలకొద్దీ ట్రాఫిక్‌జామ్

రెండు దశాబ్దాల అనంతరం తిరిగి మేడారం జాతరలో ట్రాఫిక్ సమస్య పునరావృతమైంది. తల్లులిద్దరూ గద్దెలపై కొలువైన రోజైన ఈ నెల 22 నుంచి శనివారం వరకు ఈ సమస్య కొనసాగింది. తల్లుల దర్శనానికి పోలీసులే పోటీపడ్డారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2004 నాటి ట్రాఫిక్ సమస్యను భక్తులు గుర్తుచేసుకోవడం గమనార్హం. పస్రా-తాడ్వాయి మధ్య 23 నుంచి 24 వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బస్సులు రాక మేడారం బస్‌స్టేషన్‌లో భక్తులు గంటల కొద్దీ నిరీక్షించారు. ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్లు సైతం భక్తుల ఆగ్రహానికి వేదికయ్యాయి. అధికారులే భక్తులకు క్షమాపణలు చెప్పుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఈనెల 23న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి అర్జున్ ముండా సహా ఇతర ప్రముఖుల దర్శనం కోసం గంటలకొద్దీ సాధారణ భక్తుల దర్శనాన్ని నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

భక్తుల ఆగ్రహాన్ని చవిచూసిన సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో భక్తుల ఆగ్రహానికి గురయ్యారు. ఈనెల 23న సమ్మక్క-సారలమ్మను సీఎం రేవంత్ దర్శించుకున్నారు. ఈ సమయంలో మేడారం హెలిప్యాడ్ నుంచి తల్లుల దర్శనానికి వస్తున్న క్రమంలో సాధారణ భక్తులను దర్శనానికి పంపకుండా క్యూలైన్లలో నిలిపి ఉంచారు. ఈ అసౌకర్యంపై భక్తులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులు సీఎం డౌన్ డౌన్.. అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. వాటిని పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి సహా ఇతర మంత్రులు వెళ్లిపోవడం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటం గమనార్హం.

ఎప్‌సెట్ టెస్ట్ జోన్ ఎంపికను మార్చలేం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేస్తున్నారా..? అయితే టెస్ట్ జోన్ ఎంచుకొనేటప్పుడే జాగ్రత్తపడండి. ఒకసారి ఎంపికచేసుకున్న తర్వాత టెస్ట్ జోన్‌ను ఎట్టి పరిస్థితుల్లో మార్చడం కుదరదు. ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభంకానున్నది. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 6 వరకు, ఆలస్య రుసుముతో మే 4 వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉన్నది. ఎప్‌సెట్ పరీక్షల కోసం తెలంగాణ, ఏపీలో ఈ సారి 21 టెస్ట్‌జోన్లను ఏర్పాటు చేశారు. వీటిల్లో మూడు జోన్లను విద్యార్థులు ఎంపికచేసుకోవచ్చు. విద్యార్థులు ఎంచుకున్న ప్రకారం ఆయా జోన్లల్లోనే పరీక్షా కేంద్రాలను కేటాయించనున్నట్టు ఎప్‌సెట్ కన్వీనర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణతో పాటు, ఏపీకి చెందిన వారు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉన్నదని, వీరు ఓపెన్ కోటా (15శాతం) సీట్లకు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

మార్చి 6 నుంచి డిపార్టుమెంటల్ పరీక్షల దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులకు డిపార్టుమెంటల్ పరీక్షలకు దరఖాస్తు చేసేందుకు మార్చి 6 నుంచి ఏప్రిల్ 6 వరకు అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్ త్వరలో విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు. బీటీ విధానంలో డిపార్టుమెంటల్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

లొకేటర్ యాతో ఇంటర్ ఎగ్జామ్ సెంటర్‌కు రూటు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : మీరు ఇంటర్ పరీక్షలు రాస్తున్నారా..! పరీక్షాకేంద్రం అడ్రస్ ఎక్కడని వెతుకుతున్నారా..! మీ ప్రయత్నాలన్నీ ఆపేసి.. మీ మొబైల్‌లో టీఎస్ బీఐఈ సెంటర్ లొకేటర్ యాప్‌ను డౌన్‌లోడ్‌చేసుకోండి. ఈ యాప్‌లో మీ ఎగ్జామ్ సెంటర్ కోడ్‌ను, హాల్‌టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేయండి. అంతే ఆటోమెటిక్‌గా ఆయా యాప్‌యే మీ ఎగ్జామ్ సెంటర్ రూట్‌ను చెప్పేస్తుంది. ఎగ్జామ్ సెంటర్ తెలియదన్న టెన్షన్.. సమయానికి చేరుకోలేకపోతామేమోనన్న ఆందోళన అవసరం లేకుండా నిశ్చింతగా పరీక్షలకు హాజరుకావొచ్చు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఉ 28నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు తమ సందేహాలకు 040 -24655027 ను సంప్రదించవచ్చు.

గ్రూప్-1 దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 18 ప్రభుత్వ విభాగాలలో 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మార్చి 14 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు విధించారు. మార్చి 23 నుంచి 27 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను సవరించుకోవచ్చు. గతంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే.

28 నుంచి గురుకుల కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి25 (నమస్తే తెలంగాణ): 2024-25 విద్యాసంవత్సరానికి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లోని జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఈ నెల 28 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు గురుకులాల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు. వివరాలకు http://mjptbcwreis. telangana.gov.in వెబ్‌సైట్ లేదా 040 - 23328266, 18005707778 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హజ్ యాత్రకు 7,811 మంది ఎంపిక : షబ్బీర్ అలీ

మలక్‌పేట, ఫిబ్రవరి 25: రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు హజ్ కమిటీ కోటాలో 7,811 మంది హాజీలు ఎంపికయ్యారని రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. ఆదివారం పాత మలక్‌పేట డివిజన్‌లోని హైటెక్ గార్డెన్స్‌లో హజ్ యాత్రికుల అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ హజ్ యాత్ర కోసం 11,313 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.